క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రఘునాథపాలెం: రఘునాథపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు పనులు, ఫీడర్ మెయింటెనెన్స్ పనుల కారణంగా నేడు (ఆదివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ జిల్లా శంకర్ ఒక ప్రకటలో తెలిపారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పువ్వాడ ఉదయనగర్, కోయచెలక క్రాస్‌రోడ్, గ్రీన్ కాలనీ, కేసీఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

3 నుంచి రెవెన్యూ సదస్సులు

రఘునాథపాలెం: మండలంలో ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ శ్వేత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల వారీగా జరిగిపే ఈ సదస్సుల్లో రెవెన్యూ పరమైన సమస్యలు ఉంటే వినతి పత్రాల ద్వారా అందించాలన్నారు. ఈనేపథ్యాన 3న వీవీపాలెం, కోయచలక గ్రామాల్లో జరుగుతాయని, 4న శివాయిగూడెం, వేపకుంట్లలో, 5న రేగులచలక, మంచుకొండలో, 6న బూడిదంపాడు, కోటపాడులో, 9న చిమ్మపుడి, చింతగుర్తిలో, 10న పాపటపల్లి, మల్లేపల్లిలో, 11న ఈర్లపుడి, జీకే బంజరలో, 13న పంగిడిలో గ్రామ సభలు జరుగుతాయని, సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు..



బహుమతులు అందుకున్న వారితో డీవైఎస్‌ఓ, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: వేసవి క్రీడా శిక్షణా శిబిరాల్లో భాగంగా శనివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో సమ్మర్ బ్యాడ్మింటన్ శిక్షణా శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. క్రీడాకారులను మరింత ఉత్తేజపరిచేందుకు ఈపోటీలు ఎంతో ఉపకరిస్తాయని డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి వీరభద్రం, కార్పొరేటర్ కమర్తపు మురళి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి వి.చంద్రశేఖర్, మాజీ అధ్యక్షుడు సిరిపురపు సుదర్శన్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.

పశువులను అశ్రద్ధగా వదిలేయొద్దు

ఖమ్మంరూరల్: మండలంలోని రైతులు తమ పశువులను ఇష్టానుసారంగా బయటకు వదిలేయొద్దని మండల పశువైద్యుడు హరీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వారం క్రితం ఆరెకోడుతండాలో బెండతోటలో ఉన్న గడ్డిని మేసిన ఒక గేదే, 31 గొర్రెలు, మేకలు మృతి చెందాయని, ఆ తోటకు పురుగుమందు కొట్టడం వల్లే అవి మృతి చెందాయని పేర్కొన్నారు. అదే విధంగా రోడ్లపైకి వదిలినా ప్రమాదాలు జరుగుతాయని, తెగిపడిన విద్యుత్ తీగలు, ఎక్కువ మోతాదులో తిని అవి చనిపోయే ప్రమాదముందన్నారు. ఇకనైనా రైతులు తగు జాగ్రత్తలు తీసుకుని పశువులను కాపాడుకోవాలని సూచించారు.



'ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధితో పాటు పారిశుద్ధ్యాన్ని మరింతగా మెరుగుపరిచేందుకు ప్రణాళికాయుతంగా కార్యాచరణను రూపొందించాం. అలాగే ఈ వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ప్రజలకు క్షేత్రస్థాయి పాలనను అందించేందుకు ఈనెల 3 నుంచి జోనల్ కార్యాలయాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తున్నాం. అభివృద్ధికి ఆటంకంగా ఉన్న ఇరుకు రోడ్లను వెడల్పు చేసేందుకు పనులు ప్రారంభించాం. మొత్తంగా ఖమ్మాన్ని సుందరీకరించడంతో పాటు ప్రజలకు అన్ని వసతులను అందుబాటులోకి తీసుకొచ్చేలా పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాం'అని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అన్నారు. శనివారం కేఎంసీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, 100 రోజుల ప్రణాళిక తదితర అంశాలపై 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇవ్వగా వివరాలు ఆయన మాటల్లోనే..

– ఖమ్మంమయూరిసెంటర్

ప్రణాళికాయుతంగా కార్యాచరణ..

- పారిశుద్ధ్యం, ట్రేడ్ లైసెన్స్, అండర్ అసెస్‌మెంట్‌లపై ప్రత్యేక దృష్టి
- వరదలు ముంచెత్తకుండా ముందస్తు చర్యలు
- 3 నుంచి జోనల్ కార్యాలయాలు అందుబాటులోకి..
- ప్రారంభమైన రోడ్ల విస్తరణ పనులు

'సాక్షి'తో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు..
నగరంలోని 60 డివిజన్లలో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాం. రోడ్లు, డ్రెయినేజీలలోని చెత్తను తొలగించి శుభ్రం చేసేలా ఆదేశాలు ఇచ్చాం. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చూడాలని డివిజన్ల సిబ్బందికి సూచించాం. వార్డు ఆఫీసర్లు నిరంతరం పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ చేసేలా సూచనలు చేశాం. పారిశుద్ధ్య పనుల కోసం కేఎంసీకి కొత్తగా 20 ట్రాక్టర్లను కొనుగోలు చేశాం. వాటిని ఈనెల 2న ప్రారంభించుకోబోతున్నాం. అలాగే 220 మంది కార్మికులను కాంట్రాక్టర్ ద్వారా సమకూర్చుకుంటున్నాం.

అభివృద్ధికి అడుగులు..
నగరంలో రోడ్లు ఇరుకుగా ఉండడంతో స్థానికులతో సమన్వయం చేసుకుని వారి అభీష్టం మేరకు అవసరమైన ప్రాంతాల్లో రోడ్లను విస్తరిస్తున్నాం. ఇప్పటికే మున్సిపాలిటీ నుంచి బ్రాహ్మణబజార్ వైపు వెళ్లే రోడ్డు పనులను ప్రారంభించాం. రైల్వే స్టేషన్ రోడ్డును విస్తరిస్తున్నాం. ఇక చెరువుబజార్‌కు మార్కింగ్ పూర్తయింది. త్వరలోనే పీఎస్ఆర్ రోడ్, ఆర్టీఓ కార్యాలయ రోడ్డు విస్తరణ పనులకు కార్యాచరణ రూపొందిస్తాం.

తొమ్మిది హాట్‌స్పాట్‌ల గుర్తింపు..
నగరంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుగానే అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నాం. గత కొన్నేళ్లుగా నగరంలో మలేరియా కేసులు నమోదు అవడం లేదు. డెంగీ కేసులు కూడా తగ్గాయి. నగరంలో తొమ్మిది హాట్‌స్పాట్‌లను గుర్తించి అక్కడ డెంగీ దోమ పుట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నిరంతరం ఫాగింగ్ చేసేందుకు సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్నాం.

ట్రేడ్ లైసెన్స్, అండర్ అసెస్‌మెంట్‌పై దృష్టి..
నగరంలో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేసే వారిని గుర్తిస్తున్నాం. ప్రతి వ్యాపారికి ట్రేడ్ లైసెన్స్ ఉండాలి. నగరంలో ఉన్న దుకాణాలను సర్వే చేసి లైసెన్స్ లేని వారికి జారీ చేయిస్తున్నాం. అండర్ అసెస్‌మెంట్‌లపై ప్రత్యేక దృష్టి సారించాం. అదనపు నిర్మాణాలు జరిగిన తర్వాత కూడా పాత పన్నులే చెల్లిస్తున్న వారిని గుర్తించి వారికి రివైజ్డ్ పన్ను విధిస్తాం. వీటితోపాటు నగరంలో చాలామంది రెసిడెన్షియల్ భవనాలకు అనుమతులు తీసుకుని.. వాటిలో వ్యాపారాలు చేస్తున్నారు. ఈనెల రోజుల్లో మిక్స్‌డ్ ప్రాపర్టీస్‌ను గుర్తించి వాటి పన్నులను సవరిస్తాం.

సర్వేలు పూర్తి..
ప్రభుత్వం అమలు చేయబోయే సంక్షేమ పథకాలకు సంబంధించిన సర్వేలను నగరంలో పూర్తిచేశాం. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇప్పటికే సర్వే పూర్తి కాగా.. ఈనెల 2న పాలేరు నియోజకవర్గంలోని మూడు డివిజన్లకు సంబంధించిన 165 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్‌ను ఇవ్వనున్నాం. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితాను కలెక్టర్ కార్యాలయానికి అందజేశాం. రేషన్‌కార్డుల సర్వే కూడా తుది దశకు చేరుకుంది. సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించేందుకు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాం.

విపత్తులను ఎదుర్కొనేలా..
గత అనుభవనాలను దృష్టిలో పెట్టుకుని.. ఈ వర్షాకాలంలో వచ్చే విపత్తులను ఎదుర్కొనేందుకు ముందస్తుగానే సిద్ధం అవుతున్నాం. ఇందుకు సంబంధించి అధికారులతో ఇప్పటికే సమావేశం నిర్వహించి చేపట్టాల్సిన పనులపై సూచనలు చేశాం. ముంపు ప్రాంతాల్లోని ప్రజలతో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లోని యువకులతో ఆపదమిత్ర బృందాలను ఏర్పాటు చేశాం. భారీ వర్షాలు కురిసిన సమయంలో అటు అధికారులను, ఈ బృందాలను అప్రమత్తం చేస్తాం. నగరంలో వరద పోటెత్తకుండా పెద్ద నాలాలను శుభ్రం చేయించాం.

అందుబాటులోకి జోనల్ కార్యాలయాలు..
ఈనెల 3 నుంచి నగరంలో ఏర్పాటు చేసిన నాలుగు జోనల్ కార్యాలయాలను అందుబాటులోకి తెస్తాం. స్థానికులకు పౌరసేవలను అక్కడి నుంచే అందించేలా కార్యాచరణ చేశాం. జోనల్ కార్యాలయాలకు కేటాయించిన సిబ్బంది అక్కడి నుంచే విధులు నిర్వహించనున్నారు. జోనల్ కార్యాలయాలతో పాలన వికేంద్రీకరణ జరిగి సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయి.

కేఎంసీ సమాచారం

స్ట్రోమ్ వాటర్ డ్రెయినేజీలోకి దిగిన వ్యక్తి
ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 30వ డివిజన్‌లో గల స్ట్రోమ్ వాటర్ డ్రెయినేజీ(వర్షపు వరద నీటి డ్రెయిన్) పక్కన నివాసముండే లాలయ్య శనివారం దానిలో తాళంచెవి పడిందని దిగుతుండగా జారిపడ్డాడు. గమనించిన యువకులు స్థానిక కార్పొరేటర్‌కు సమాచారం అందించి బయటకు తీయగా.. అతడికి ఎలాంటి గాయాలు కాలేదు.

ఏఎంసీపై కార్పొరేటర్ ఫిర్యాదు..
స్థానిక సమస్యలను వివరించేందుకు అసిస్టెంట్ కమిషనర్‌కు ఫోన్ కాల్ చేస్తే సక్రమంగా స్పందించకుండా నిర్లక్ష్యంగా మాట్లాడారంటూ ఓ కార్పొరేటర్ మేయర్ నీరజను కలిసి వివరించారు. అనంతరం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

అభివృద్ధి పనుల పరిశీలన..



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న మేయర్ నీరజ

నగరంలోని 26వ డివిజన్ సుగ్గలవారి తోట ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మేయర్ పునుకొల్లు నీరజ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

అస్తవ్యస్తంగా కార్యాలయ నిర్వహణ..
పలురకాల పౌర సేవల కోసం కేఎంసీ కార్యాలయానికి వస్తున్న ప్రజలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈక్రమాన వారు తమ వాహనాలను అడ్డదిడ్డంగా పెడుతుండడంతో లోపలకు వెళ్లాల్సిన అధికారుల వాహనాలు రాలేని పరిస్థితి ఉంది. దీంతో మెప్మా అధికారులపై ఉన్నతాధికారులు మండిపడుతున్నట్లు తెలిసింది.

డెంగీపై అవగాహన కల్పించండి..

ప్రజల్లో డెంగీపై చైతన్యం కలిగించేందుకు ముందస్తుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులకు సూచించారు. శనివారం కేఎంసీ కార్యాలయంలో వైద్య శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యాన ముందస్తు జాగ్రత్త చర్యలు, గత సంవత్సరాల అనుభవాలు, ప్రస్తుత ఏడాదిలో అమలు చేయాల్సిన ప్రణాళికలపై చర్చించారు. గత సంవత్సరం కేసులు నమోదైన డివిజన్లను 'హాట్‌స్పాట్లు'గా గుర్తించి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని తెలిపారు. కాగా, గతేడాది కేఎంసీ పరిధిలో మొత్తం 69 కేసులు నమోదయ్యాయని, హాట్ స్పాట్లుగా గుర్తించిన ప్రాంతాల్లో ముందస్తు అవగాహన కార్యక్రమాలు, ప్రజల్లో చైతన్యం కల్గించడం తదితర ప్రయత్నాల మూలంగా గత సంవత్సరం కేసుల సంఖ్య అంతకు ముందు సంవత్సరంలో పోల్చితే గణనీయంగా తగ్గినట్లు పేర్కొన్నారు. హాట్ స్పాట్ ప్రాంతాల్లో సకాలంలో క్రిమిసంహారక పిచికారీ, ఫాగింగ్, బ్లీచింగ్, ఆయిల్ బాల్స్ ఉపయోగించాలని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను డెంగీపై అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ చేస్తున్న గ్రామస్తులు

కామేపల్లి: మండలంలోని మద్రిగూడెంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయస్వామి, ముత్యాలమ్మతల్లి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ, బొడ్రాయి, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. వేద పండితులు ఉప్పల సాగరశర్మ ఆధ్వర్యాన వేదమంత్రోచ్ఛరణల మధ్య విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించగా.. వేలాది మంది భక్తులు వేడుకలను తిలకించారు. శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణ, దాత దిరిశాల నరేష్‌చౌదరి, స్వాతి దంపతుల చేతుల మీదుగా శాంతి కల్యాణంలో భాగంగా సీతారాముల కల్యాణం నిర్వహించి భక్తులకు అన్నదానం వితరణ, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మికతతో పాటు పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్, గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రతిష్ఠా మహోత్సవం

నేలకొండపల్లి: మండలంలోని రాయగూడెం గ్రామంలో నాభిశిల బొడ్రాయి పునఃప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా ముగిసింది. గత నెల 29 నుంచి ఉత్సవాలు ప్రారంభంకాగా శనివారం ముగియడంతో బొడ్రాయికి ప్రత్యేక పూజలు, యాగశాల వద్ద హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, మాజీ ఎంపీపీ తీగ వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ పతానాపు నాగయ్య, గ్రామ పెద్దలు బోయిన వేణు, నంబూరి సత్యనారాయణ, తీగ రమణయ్య, నరసింహారావు, శ్రీను, రోశయ్య, బలరాం, నరేష్, తదితరులు పాల్గొన్నారు.



వేడుకలో పాల్గొన్న భక్తులు

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు

ఖమ్మంరూరల్: రాబోయే వర్షాకాలంలో ఏదులాపురం మున్సిపల్‌లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మున్సిపల్ సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని నాయుడుపేటలో మున్సిపల్ సిబ్బందికి జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వంద రోజుల పాటు మున్సిపల్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 2న మున్సిపల్ కార్యాలయం నుంచి వరంగల్ క్రాస్‌రోడ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సన్మానాలు..

సొసైటీ కార్యదర్శికి..
తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం సహకార సంఘం కార్యదర్శిగా పనిచేస్తున్న మందపాటి శ్రీనివాస్‌రెడ్డి బదిలీపై వేంసూర్ మండలం మర్లపాడు సహకార సంఘం కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయనను సొసైటీ చైర్మన్ చావా వేణుగోపాలకృష్ణ, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ.. సొసైటీ అభివృద్ధిలో ఆయన చేసిన చొరవ ఎనలేనిదన్నారు. అనంతరం జల్లెపల్లి సొసైటీలో పనిచేస్తున్న ఏలూరి ఆనందరావుకు నూతన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి నారెడ్డి సీతారాంరెడ్డి, వైస్ చైర్మన్ చామకూరి రాజు, డైరెక్టర్లు కమ్మకోమటి నాగేశ్వరావు, ఎడ్లపల్లి నవీన్, డీసీసీబీ మేనేజర్ సౌజన్య, సూపర్‌వైజర్ భరత్, బీరోలు సొసైటీ కార్యదర్శి సత్యనారాయణ, సీనియర్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, దానయ్య, బి.రమేష్, సైదులు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు..



సన్మానిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ఉద్యోగ విరమణ పొందిన పోలీస్, హోంగార్డు అధికారులకు సీపీ కార్యాలయంలో సీపీ సునీల్‌దత్ శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా వివిధ విభాగాల్లో బాధ్యతాయుతమైన విధులు నిర్వర్తించి పోలీస్ శాఖకు ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో ఏఎస్ఐలు రామకృష్ణారెడ్డి, గోపాల్‌రావు, ఏఆర్ఎస్ఐ రమేష్, హోంగార్డు వెంకటేశ్వర్లు ఉన్నారు. అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, ఏఆర్ ఏసీపీ సుశీల్‌సింగ్, ఆర్ఐలు కామరాజు, సురేష్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సభ్యులు నీరజ, రామకృష్ణ, నాగరాజు, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలు వేలం వాయిదా..

నేలకొండపల్లి: మండలకేంద్రంలోని శ్రీ రాజగోపాలస్వామి దేవాలయం భూములు కౌలు కోసం వేలం పాటను శనివారం ఆలయ ఆవరణలో నిర్వహించగా.. రైతుల అభ్యంతరాలతో వాయిదా పడింది. రూ.కోట్ల విలువైన భూములు ఆక్రమణ చెరలో ఉన్నాయని, వాటి నిగ్గు తేల్చే వరకూ వేలం పాట నిర్వహించొద్దని వేలం పాటను అడ్డుకున్నారు. సర్వే నంబర్ 162, 163, 164, 185, 186లలో ఉన్న దాదాపు రూ.2కోట్ల విలువైన 13 ఎకరాల భూమిని కొంత మంది ఆక్రమించుకుంటే అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఆ భూములకు సంబంధించి సర్వే చేసి హద్దులు నిర్ణయించే వరకూ వేలం పాటను నిర్వహించొద్దని డిమాండ్ చేశారు. దీంతో ఆలయ ఈఓ కె.శ్రీకాంత్ వేలం పాటను వాయిదా వేశారు. ఈమేరకు స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం బోదులబండ, నేలకొండపల్లిలో ఉన్న మిగతా సర్వే నంబర్లలో ఉన్న భూములకు వేలం పాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం దేవస్థానం ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ వంగవీటి నాగేశ్వరరావు, రైతు ప్రతినిధులు యడవల్లి హుస్సేన్, లక్కం ఏడుకొండలు, మన్నె కృష్ణారావు, దాసరి రామారావు, గడ్డం లక్ష్మయ్య, లింగం ఉపేందర్, వాకా శ్రీనాథ్, కాసాని లింగయ్య, కైలాసపు వెంకటేశ్వర్లు, మన్నె శ్రీను, కందికొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

నకిలీ విత్తనాలు అమ్మొద్దు



మాట్లాడుతున్న ఎస్సై నాగరాజు

కూసుమంచి: రైతులకు డీలర్లు నాణ్యమైన విత్తనాలను అందించాలని, నిషేధిత విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఓ వాణి, ఎస్సై నాగరాజు హెచ్చరించారు. శనివారం కూసుమంచిలోని రైతు వేదికలో వ్యవసాయ, పోలీస్‌శాఖలు సంయుక్తంగా నిర్వహించిన విత్తన డీలర్ల సమావేశంలో వారు మాట్లాడారు. డీలర్లు విత్తన, ఎరువుల విక్రయాలకు లైసెన్సులు కలిగి ఉండాలని, విత్తనాల కొనుగోళ్లకు బిల్లులు కచ్చితంగా ఇవ్వాలన్నారు. ఎక్కడైనా బీటీ-3 విత్తనాలను విక్రయిస్తే వ్యవసాయశాఖ అధికారులకు గానీ, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు గానీ సమాచారం అందించాలని కోరారు.

దేవాలయాల దర్శనాలకు వ్యవసాయ కూలీలు..

రఘునాథపాలెం: రైతు బాగుంటే ఊరంతా బాగుంటుందని నమ్మే మండలంలోని వేపకుంట్ల గ్రామ ప్రజలు వ్యవసాయానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ గ్రామానికి చెందిన మహిళా కూలీలు రమాదేవి ముఠామేస్త్రి నేతృత్వాన ఏటా వ్యవసాయ పనులు ముగిసిన అనంతరం దేవాలయాలను దర్శించి మొక్కులు చెల్లించుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది కూడా శనివారం రాత్రి 40 మంది మహిళలు యాత్రకు బయలుదేరారు. ఈ బృందం యాదగిరిగుట్ట, సురేంద్రపురి, వేయి స్తంభాల గుడి, భద్రకాళి, రామప్ప, మేడారం సమ్మక్క సారక్క దేవాలయాలను దర్శించుకోనున్నారు. వ్యవసాయ కాలంలో సంపాదించిన డబ్బులో కొంత భాగాన్ని పొదుపు చేసి ఇలా మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈ యాత్రలో నాగమణి, మేక సుజాత, నాగరాజ్యం, చెన్నరేణుక, ఎల్లమ్మ, మంగమ్మ, ఉమా, రేణుక, ఆదమ్మ, సుశీల, ముత్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పొగాకు వ్యతిరేక దినోత్సవం..



ర్యాలీ నిర్వహిస్తున్న కమిటీ బాధ్యులు

ఖమ్మం రాపర్తినగర్: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ కమిటీ సభ్యులు వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెవిలియన్ గ్రౌండ్‌లో 8 అడుగుల బాహుబలి సిగరేట్‌ను తయారుచేసి పొగాకు ద్వారా ఉత్పత్తయ్యే పదార్థాలను వ్యతిరేకిస్తున్నామని ర్యాలీ నిర్వహించారు. ఈక్రమంలో చాలామంది వాకర్లు, మహిళలు సిగరేట్ బొమ్మపై సంతకాలు చేసి పొగాకును వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వాలు వెంటనే పొగాకు ఉత్పత్తులు నిషేధించాలనిడిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, వెంకట్, సుదర్శన్, మంద వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, శ్రీనివాస్, మాధవి,రమా, భాగ్య, రాజ్యలక్ష్మి, సబిత తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం
ఖమ్మం మామిళ్లగూడెం: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా ఉద్యమాలు నిర్మించి, పేదల పక్షపాతిగా, వారికి పెద్దన్నగా సీపీఐ నిలిచిందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. శనివారం ఖమ్మంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల ఫలితంగా పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర సంక్షోభంలోకి నెట్టి వేయబడుతున్నారని విమర్శించారు. మహాసభల్లో స్థానిక సమస్యలు గుర్తించి, సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. తొలుత రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్‌కె.జానిమియా పతాకాన్ని ఆవిష్కరించి 21 మందితో నూతన కౌన్సిల్ ఏర్పాటు చేశారు. నూతన కార్యదర్శిగా వరద నరసింహారావు, సహాయ కార్యదర్శిగా మాడుగుల నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మల కొండయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాడుగుల నాగేశ్వరరావు మలకొండయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మహమ్మద్ సలాం, పగడాల మల్లేష్, యాకుబ్, హనుమంతరావు, శ్రీనివాసరావు, సరోజనమ్మ, నాగమణి, రవి, సామేలు, నాగేశ్వరరావు, భూపాల్ రెడ్డి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారులకు అవగాహన



హస్నాబాద్‌లో మాట్లాడుతున్న ఎంపీడీ

తిరుమలాయపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథక లబ్ధిదారులకు శనివారం మండలంలోని పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణంలో విధి విధానాలను వివరించారు. మండలంలోని కాకరవాయి, రాజారం, పైనంపల్లి, సోలీపురం, హస్నాబాద్, మహ్మదాపురం, లక్ష్మీదేవిపల్లి, బచ్చోడుతండా, ఇస్లావత్‌తండా గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో మండల పంచాయతీ అధికారి పి.సూర్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్ మిథున్, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి
నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం గ్రామానికి చెందిన నెలకుర్తి శేఖర్‌రెడ్డికి చెందిన పాడి గేదె రోజు మాదిరిగానే పొలాల వైపు శనివారం మేతకు తీసుకెళ్లారు. ఈక్రమంలో మేత మేస్తుండగా.. ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైరుకు తగిలి అక్కడిక్కడే మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.70 వేలకు పైగా ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

నృత్య కళాకారులకు ప్రశంసలు..



సర్టిఫికెట్లు అందిస్తున్న చైర్మన్లు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని గుట్టలబజార్ శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో శుక్రవారం రాత్రి నటరాజ నృత్య నికేతన్ చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. సంస్థ వార్షికోత్సవ కార్యక్రమంలో చిన్నారులు నృత్యాలు చేశారు. ఈనేపథ్యాన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎరగర్ల హనుమంతరావు, ఆలయ చైర్మన్ మేళ్లచెరువు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని చిన్నారుల నృత్యాలను ప్రశంసించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు మాధవరావు మాట్లాడుతూ.. నాట్యాలయానికి చెందిన నైనకంటి జైశ్రీ, హర్షిత, కీర్తన, షణ్ముఖి, చిన్మయిలను వరల్డ్ బుక్ రికార్డుకు ఎంపిక చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కరుణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు
తిరుమలాయపాలెం: ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ పిండిప్రోలు గ్రామానికి చెందిన తాత మధుసూదన్ జన్మదిన వేడుకలను శనివారం తిరుమలాయపాలెంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దేదీప్యమానంగా..





జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, కూడళ్లను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. విద్యుత్ దీపకాంతుల నడుమ కార్యాలయాలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి.

– ఖమ్మంమయూరిసెంటర్

కేఎంసీ కార్యాలయం ఇలా..